క్లుప్తంగా

అన్నమయ్య సంకీర్తనల శిక్షణ ప్రారంభం



సంకీర్తనలు ఆలపిస్తున్న జ్యోతిర్మయి

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లోని భక్త తుకారాం ఆలయ ప్రాంగణంలో సోమవారం అన్నమయ్య సంకీర్తన శిక్షణ శిబిరం ప్రారంభమైంది. శ్రీవెంకటేశ్వర స్వామి సంకీర్తనల రాయబారి కొండవీటి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ నెల 24 వరకు శిబిరం కొనసాగుతుంది. ఈ శిక్షణలో పాల్గొన్న సుమారు 100 మందికి అన్నమయ్య సంకీర్తనల గురించి జ్యోతిర్మయి వివరించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో భక్త తుకారాం విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి జయరాం, జాయింట్ సెక్రటరీ సోమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయ సాధనకు పోరాడుదాం



పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు, జూ కార్మికులు

ఆరిలోవ: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధన కోసం పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపునిచ్చారు. జూ పార్కు ప్రధాన ద్వారం వద్ద జూ కార్మికులు సోమవారం పుచ్చలపల్లి వర్ధంతి నిర్వహించారు. పుచ్చలపల్లి చిత్రపటానికి కార్మిలకుతో కలిసి సీఐటీయూ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య నీతి, నిజాయితీ, నిడారంబరతతో కూడిన వ్యక్తిగా పేరు పొందారని, దేశ రాజకీయాలకు వన్నె తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో జూ కార్మిక యూనియన్ నాయకులు రామారావు, నరేష్, నాగేశ్వరరావు, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



చలివేంద్రంలో మజ్జిగ అందిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం: వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు పాత వెంకోజీపాలెంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. సోమవారం నిర్వాహకులు మజ్జిగ పంపిణీ చేశారు. సుధాకర్ తల్లి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి పాదచారులు, వాహన చోదకులకు మజ్జిగ అందిస్తున్నారు.

సింహాద్రిపురంలో షార్ట్ సర్క్యూట్



షార్ట్ సర్క్యూట్ జరిగిన ఇంట్లో దగ్ధమైన సామగ్రి

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు కొండవాలు ప్రాంతం సింహాద్రిపురంలోని ఓ ఇంట్లో సోమవారం తెల్లవారు జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఇంట్లో సామగ్రి దగ్ధమైంది. ఇంట్లో ఉన్న గ్యాస్ సిలండర్‌ను హుటాహుటిన బయటకు తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. సింహాద్రిపురంలోని కమ్యూనిటీ హాల్ పక్కనున్న ఓ ఇంట్లో తల్లీకూతుళ్లు నివసిస్తున్నారు. సోమవారం వేకువజామున తల్లి వెరమశెట్టి ఈశ్వరమ్మ, కుమార్తెలు ఎం.లక్ష్మి, రామలక్ష్మి నిద్రిస్తున్న సమయంలో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. దీన్ని గుర్తించడంతో ఇంట్లోంచి వారు ముగ్గురు బయటకు పరుగు తీశా రు. గ్యాస్ సిలండర్‌ను బయటకు తీసుకొచ్చామని బాధితులు పేర్కొన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఇంట్లో ఉన్న సామగ్రి అంతా దగ్ధమైందని వారు విలపించారు.

బృందావనం



ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న పిల్లలు



ప్లే ఏరియాలో ఆడుకుంటున్న చిన్నారులు



ఎంవీపీ సెక్టార్-11లోని బృందావన్ పార్క్ ముఖద్వారం



వాకింగ్ ట్రాక్‌ను ఆనుకొని ఆహ్లాదాన్ని పంచుతున్న మొక్కలు

- ఆహ్లాదం పంచుతున్న ఎంవీపీ సెక్టార్-11లోని జీవీఎంసీ పార్క్
- అత్యాధునికంగా వాకింగ్ ట్రాక్, క్రీడా ప్రాంగణాలు
- చిన్నా పెద్దా మెచ్చేలా ఏర్పాట్లు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-11లో నూతనంగా తీర్చిదిద్దిన బృందావనం పార్క్ స్థానికులకు ఆహ్లాదాన్ని.. ఆనందాన్ని పంచుతోంది. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఈ పార్కును ఇటీవల జీవీఎంసీ పూర్తిస్థాయిలో ఆధునికీకరించింది. వాకింగ్ ట్రాక్, క్రీడా ప్రాంగణాలను అత్యాధునికంగా తీర్చిదిద్ది అందుబాటులోకి తెచ్చింది. సెక్టార్-11 వాసులు బృందావనంలో సందడిగా.. సరదాగా గడుపుతున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కును సందర్శిస్తూ ఆస్వాదిస్తున్నారు. చిన్నారులకు వేసవి సెలవులు కావడంతో వారి ఆటపాటలకు బృందావన్ పార్క్ కేంద్రంగా మారింది.

రూ.1.12 కోట్లతో థీమ్ పార్క్

పిల్లల నుంచి పెద్దలు, వృద్ధుల వరకు అందరికీ ఆహ్లాదాన్ని పంచేలా ఎంవీపీ సెక్టార్-11లో రూ.1.12 కోట్లతో థీమ్ పార్కును జీవీఎంసీ తీర్చిదిద్దింది. ఓపెన్ జిమ్, షటిల్ కోర్టు, ముగ్గ్రం ట్రాక్, ప్లస్ ఆకారంలో ఆహ్లాదకరంగా ఇంటర్ లాకింగ్ టైల్స్, సందర్శకులు సేదతీరేందుకు భారీ వృక్షం చుట్టూ ఏర్పాటు చేసిన ఆధునిక ట్రీ బెంచ్, ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు వృద్ధుల కోసం వెయిటింగ్ హాల్ ఆధునికీకరణ, చిన్నారుల కోసం ఆధునిక ప్లే ఏరియా, డెకరేటివ్ లైటింగ్ పోల్స్, గ్రిల్‌తో కూడిన కాంపౌండ్ వాల్ వంటి సౌకర్యాలతో పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు ఈ పార్కు సేవలను స్థానికులు వినియోగించుకుంటున్నారు.

జీవీఎంసీకి అభినందనలు

బృందావన్ పార్కును అన్ని సౌకర్యాలతో ఆధునికీకరించిన జీవీఎంసీకి అభినందనలు. దశాబ్దాలుగా ఈ పార్కు సంరక్షణ కోసం మేం కష్టపడుతున్నాం. సెక్టార్-11 వాసులకు ఆహ్లాదం, ఆటవిడుపుగా పార్కు సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. పార్కు నిర్వహణ బాధ్యతలను మా అసోసియేషన్‌కు జీవీఎంసీ అప్పగించింది. కాలనీ వాసులంతా డబ్బులు వేసుకొని పార్కు నిర్వహణ, పరిశుభ్రతకు బాటలు వేసుకుంటున్నాం.

– రామకృష్ణ, అధ్యక్షుడు, సెక్టార్-11 నివాసితుల సంఘం

అనధికార నిర్మాణంపై జీవీఎంసీ కొరడా



విశాలాక్షినగర్ కొండవాలులో నిర్మించిన అనధికార శ్లాబ్‌ను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డులో అనధికార నిర్మాణంపై టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝులిపించారు. విశాలాక్షినగర్‌లో కైలాసగిరి బెటాలియన్ క్యాంప్ కార్యాలయం సమీపం కొండవాలులో ఓ వ్యక్తి అనధికారికంగా నాలుగో అంతస్తు నిర్మించాడు. ఈ నెల 13న సాధారణ ఎన్నికలు జరిగిన రోజున జీవీఎంసీ అధికారులు చూడరనే ఆలోచనతో చకచకా శ్లాబ్ వేసేశాడు. విషయం తెలుసుకున్న జీవీఎంసీ జోన్-2 టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ భవనాన్ని పరిశీలించారు. అనధికార శ్లాబ్ వేసినట్లు గుర్తించారు. దీంతో సోమవారం టీపీవో వరప్రసాద్ ఆదేశాలతో స్క్వాడ్ టీం ఇన్‌చార్జి రమేష్, సిబ్బంది భవనం వద్దకు చేరుకుని శ్లాబ్‌కు పెద్ద రంధ్రాలు చేశారు. కొండవాలు కావడంతో పాటు 12 నుంచి 15 అడుగుల వెడల్పు రోడ్డు ఉన్న ఆ ప్రాంతంలో సిల్ట్, గ్రౌండ్, ఫస్ట్, సెకెండ్, థర్డ్ ఫ్లోర్ల నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతి ఇవ్వడంపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ భవన యజమాని వేరేచోట ఉన్న రోడ్డును ప్లాన్‌లో చూపించి అధికారులను మేనేజ్ చేసి భవనం నిర్మించినట్లు ఆరోపణలున్నాయి. అదీ చాలక అనధికారికంగా నాలుగో ఫ్లోర్ నిర్మించేయడం విశేషం. దీనిపై ఫిర్యాదులు చేయడంతోనే అధికారులు స్పందించారని స్థానికులు అంటున్నారు.

బీచ్ రోడ్డులో యథేచ్ఛగా పశు సంచారం



బీచ్ రోడ్డులో వాహనాలకు అడ్డంగా సంచరిస్తున్న గేదెలు

ఏయూ క్యాంపస్: నగరంలోని ప్రధాన రహదారులపై పశు సంచారం యథేచ్ఛగా జరుగుతోంది. అత్యధిక శాతం మంది సందర్శకులు వచ్చే సాగర తీరంలో సైతం పశువుల సంచారం పెరగిపోతోంది. అత్యంత రద్దీగా ఉండే సాయంత్రం వేళల్లో పశువులు బీచ్ రోడ్డులోని రహదారులపై అడ్డంగా దర్శనమిస్తున్నాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం జీవీఎంసీ అధికారులు చేపట్టాల్సిన అవసరం ఉంది. సోమవారం సాయంత్రం విక్టరీ ఎట్ సీ ఎదురుగా ఐదారు గేదెలు రోడ్డుకు అడ్డంగా సంచరించాయి. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహన చోదకులు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఒక్కసారిగా గుంపుగా గేదెలు రోడ్డుమీదకు వచ్చాయి. ఇవి అటుగా వెళ్తున్న పోలీస్ వాహనానికి సైతం అడ్డంగా రావడం గమనార్హం. నిత్యం పదుల సంఖ్యలో ఆవులు, గేదెలు బీచ్ రోడ్డులో సంచరించడం వల్ల వాహన చోదకులు, పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు వీటిని కట్టడి చేయడానికి తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

సంతలో జోరుగా మామిడిపండ్ల విక్రయాలు



పిఠాపురం కాలనీ సంతలో విక్రయిస్తున్న మామిడిపండ్లు

మద్దిలపాలెం: పిఠాపురం కాలనీలో సోమవారం జరిగిన సంతలో మామిడిపండ్లను పోటాపోటీగా విక్రయించారు. సంతలో ఎక్కడ చూసినా మామిడి పండ్ల దుకాణాలే దర్శనమిచ్చాయి. కిలో మామిడి పండ్లు రూ.80 నుంచి రూ.100 చొప్పున విక్రయించారు. మరికొందరూ పోగులు వేసి చిన్న పెద్ద పండ్లను వాటాల ప్రకారం అమ్మకాలు సాగించారు. గత వారం ఎన్నికల కారణంగా సంత అంతగా జరగలేదు. దీంతో ఈ వారం సంతకు అధిక సంఖ్యలో జనాలు తరలిరావడంతో కిక్కిరిసిపోయింది. దీనికితోడు శివాజీపాలెం గ్రామ దేవత చిన పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవ కావడంతో ప్రత్యేకత సంతరించుకుంది.

త్వరితగతిన అభివృద్ధి పనులు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



జగదాంబ నుంచి లేపాక్షి జంక్షన్ వరకు అభివృద్ధి పనులు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్



లేపాక్షి జంక్షన్ వద్ద కాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్ – 4 పరిధి జగదాంబ జంక్షన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జంక్షన్‌లో నిర్మాణంలో ఉన్న క్లాక్ టవర్, లేపాక్షి జంక్షన్ అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ముందుగా జగదాంబ జంక్షన్‌లో క్లాక్ టవర్‌ను పరిశీలించి సుందరీకరణ పనులకు సంబంధించి పర్యవేక్షక ఇంజినీరు వినయ్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు. ఈ నెలాఖరుకు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం లేపాక్షి జంక్షన్ వద్ద కాలువ నిర్మాణ పనులు పరిశీలించారు. సర్కిల్ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని, రోడ్డు, సెంటర్ మీడియన్ పనులు వెంటనే పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీరు సత్యనారాయణరాజును ఆదేశించారు.

- జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ రాణిబొమ్మ వరకు అభివృద్ధి చేసిన రోడ్డుకి ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై గల ఆక్రమణలు వెంటనే తొలగించాలని జోన్ – 4 టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్‌ప్రసాద్‌ను కమిషనర్ ఆదేశించారు. పరిశీలనలో జోన్ – 4 జోనల్ కమిషనర్ ప్రసాదరావు, కార్యనిర్వాహక ఇంజినీరు సుబ్బారావు, డీడీహెచ్ దామోదరరావు, ఏసీపీ ఝాన్సీలక్ష్మి, ఏఎంవోహెచ్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

చిన పోలమాంబ పండగ శోభ

- ఘనంగా తొలేళ్ల సంబరం
- నేడు అమ్మవారి వార్షిక జాతర



చిన పోలమాంబ అమ్మవారు

మద్దిలపాలెం: శివాజీపాలెంలో కొలువైన చిన పోలమాంబ అమ్మవారి వార్షిక పండగ మహోత్స వం సోమవారం తొలేళ్ల సంబరంతో ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 12న చాటింపుతో వివిధ అవతారాల్లో అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించామని శ్రీకృష్ణ సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. మంగళవారం అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం నిర్వహించనున్నామన్నారు. తొలేళ్ల సంబరంలో అమ్మవారు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ నెల 28న మారువారం పండగ నిర్వహించనున్నామని ఆలయ కమిటీ పేర్కొంది.



పీతలవానిపాలెం కూడలిలో విద్యుత్ దీపాలంకరణలు

విద్యుత్ దీపాలంకరణతో శోభాయమానం

చిన పోలమాంబ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా శివాజీపాలెంలో అమ్మవారి ఆలయంతో పాటు శివాజీపాలెం, మంగాపురం కాలనీ, పీతలవానిపాలెం, పిఠాపురం కాలనీల్లోని అన్ని ముఖద్వారాల వద్ద విద్యుత్ దీపాలంకరణ చేశారు. శివాజీపాలెం, ప్రధాన రహదారి, పీతలవానిపాలెం గ్రామ కూడలి వద్ద దేవుళ్ల నమూనాలో భారీ విద్యుత్ కటౌట్లు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీలన్నీ విద్యుత్ దీపాల కాంతులతో శోభాయమానంగా కళకళలాడుతున్నాయి.

ప్రధాన జాతర నేడు

చిన పోలమాంబ వార్షిక జాతర మహోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణా సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారని చెప్పారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వేడుకల్లో భాగంగా వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



శివాజీపాలెం ముఖద్వారం వద్ద విద్యుద్దీపాలు

భాషా ప్రావీణ్యంపై ముగిసిన వర్క్‌షాప్



గోపికుమార్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: సంస్కృతం, హిందీ, తెలుగు భాషల ప్రావీణ్యంపై ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్‌లో నిర్వహించిన ఉచిత వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ×ఎన్‌రిచింగ్ హ్యూమన్ వ్యాల్యూస్ త్రూ లాంగ్వేజ్ లెర్నింగ్। పేరిట ఈ నెల 14న వర్క్‌షాప్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథి సాంఖ్య టెక్నాలజీస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.గోపికుమార్ మాట్లాడుతూ ప్రపంచ విజ్ఞానానికి సంస్కృత భాష ముఖద్వారంగా నిలుస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన వికసిత్ భారత్ లక్ష్యం.. భాషల ద్వారానే సుసాధ్యమవుతుందన్నారు. గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.ఎస్.బోస్ మాట్లాడుతూ మానవీయ విలువలకు భాషలే మూలంధారంగా నిలుస్తాయన్నారు. సమాజంలో విలువలు పెంచే దిశగా ప్రతి ఒక్కరూ వారి వారి బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. అనంతరం గోపికుమార్‌ను కళాశాల ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య అయ్యగారి ఆనంద్, డాక్టర్ వారణాసి వెంకటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

భూలోకమాత ఉత్సవం నేడు



మద్దిలపాలెంలో విద్యుత్ దీపాలంకరణ

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెం జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ వద్ద గల భూలోకమాత అమ్మవారి వార్షిక పండగల మహోత్సవం మంగళవారం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా మద్దిలపాలెం ప్రాంతాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించామన్నారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనం భక్తులకు కల్పిస్తామని చెప్పారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయని, భక్తులు పాల్గొవాలని కోరారు.

నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దుదాం



సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్ : వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించి నగరంలో కాలుష్యాన్ని అరికట్టేందుకు, విశాఖను కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. తన బంగ్లా నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సోమవారం ఆయన సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు అధికారులు, సిబ్బంది ప్రజా రవాణాను ఉపయోగిస్తున్నారన్నారు. ఎకో – వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో – జీరో పొల్యూషన్‌లో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టి అమలు చేస్తోందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని కోరారు.

ఫాస్ట్‌ఫుడ్ షాప్‌లో చెలరేగిన మంటలు

పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రంగప్రవేశంతో తప్పిన ప్రమాదం



బీచ్ రోడ్డులోని ఫాస్ట్‌ఫుడ్ షాప్‌లో మంటలు

బీచ్‌రోడ్డు: ఆదివారం అర్ధరాత్రి సమయంలో రోడ్ సైడ్ ఉన్న ఓ ఫాస్ట్‌ఫుడ్ షాప్‌లో నుంచి మంటలు చెలరేగడంతో ఒక్కసారిగా చుట్టుపక్కల వారు ఉలిక్కిపడ్డారు. సరైన సమయంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది స్పందించడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. చినవాల్తేరు నుంచి పార్క్ హోటల్ వైపు వెళ్లే బీచ్ రోడ్డులోని ఓ ఫాస్ట్‌ఫుడ్ షాప్ యజమాని ఆదివారం రాత్రి వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఆ షాప్ నుంచి చిన్న మంటలు వ్యాపించడం కనిపించాయి. దీనిని గమనించిన సందర్శకులు అక్కడే రాత్రి విధుల్లో ఉన్న మూడో పట్టణ ఎస్ఐ సంతోష్‌కు సమాచారం అందించారు. షాపులో మంటలను పరిశీలించిన ఆయన.. అందులో గ్యాస్ సిలిండర్ ఉన్నట్లు గుర్తించి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వెనువెంటనే రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి పెనుప్రమాదం జరగకుండా నివారించారు. దీంతో చుట్టుపక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు. ఈ అగ్నిప్రమాదంలో పాక్షికంగా షాపు కాలిపోయిందని ఎస్ఐ సంతోష్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కార్యక్రమాలు

దాబాగార్డెన్స్: మానవ హక్కులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్టు డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ తెలిపారు. మానవ హక్కుల కౌన్సిల్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడేందుకు కాలుష్య నియంత్రణ మండలి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా పలు ఫార్మా, పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య నియంత్రణపై జిల్లా అధికార యంత్రాంగంతోపాటు జీవీఎంసీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ పోర్టు, స్టీల్‌ప్లాంట్, ఇతర ఫార్మా కంపెనీల కారణంగా విశాఖ నగరంలో కాలుష్యం పెరిగిపోయిందన్నారు. ప్రతీ ప్రాంతంలోనూ గెడ్డలు, కాలువలను కాపాడుకోవాలన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను పక్కాగా అమలు చేసే క్రమంలోనే మానవ హక్కుల కౌన్సిల్ కూడా భాగస్వామ్యమై అవగాహన కార్యక్రమాలు చేపడతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మానవ హక్కుల కౌన్సిల్ నేతృత్వంలో చేపట్టబోయే అవగాహన కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరించారు. ఏయూ గాంధీయన్ విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సీతామాణిక్యం, మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.